# ధర్మపన్నమ్*

నీ కన్నకొడుకు, నీవుచెప్పిన మాట వినకుండా చెడిపోతున్నాడు—అని అనుకుంటావా అది కేవలం, నీ బుద్ధిలోపం—నీ అహంకారం— అంతే కాని, ఆ విషయంలో వాడి దోషం ఎంత మాత్రమున్నూ లేదు.

కాని—ఇది, నీవు ససేమిరా ఒప్పుకోవు—వాడి మంచికోసమే చెపుతున్నా నంటావు— వాడు బ్రతికి బాగుపడాలనీ ముందు ముందు వృద్ధిలోకి రావాలనీ, నలుగురిలో తానొకడై తల ఎత్తుకుని, పైన బట్టవేసుకు తిరగాలనీ— ప్రయోజకుడు కావాలనీ—ఇందుకోసం యీ కంఠశోషంతా అంటావు.

సరేనయ్యా—నీ మాటమీద నాకు గురి ఉండవచ్చు, కాని, అవతలవాడికి—వాడు నీ కొడుకైతే మాత్రం—అంత లక్ష్యమూ ఉండితీరాలని, ఏమిటి, నీకా హజం?

ఏం—విస్సన్న చెప్పినంత మాత్రాన—వేదం కావాలని పట్టుబడితే—ఇవాళేకాదు— అవాళైనా ఎవడన్నా – ఒప్పుకున్నాడా?—

అది కాలంలో, శ్వేతకేతువు ధీమా ఒక్కమారు జ్ఞాపకం చేసుకో—వాడు అప్పటికి వడసారం పసిపాపడే— గట్టిగా ముక్కుపచ్చలన్నా ఆరనివాడే—అయితేమాత్రం—వాళ్ళ నాన్నమాట విన్నాడా?—అంత ఋషిని పట్టుకుని గదమాయించాడా లేదా—

ఏం—ఇంకా జ్ఞాపకంరాలా, జరిగిన సంగతేమిటో—

ఆ రోజుల్లో—ఆడదంటే, కొట్టాంలోకట్టేసి ఉన్న గొడ్డుతో సమానం—ఇంట్లో వాడుకునే చెంబూ తప్పేలాతో సమానం— ఆసామికి ఉన్న చరాస్థితో, అదో పనిముట్టు—అరుగుమీద పరచిఉండే నలిగిన—చాప అతిథి ఎవరు వచ్చినా హాయిగా పడుకోవచ్చు—పడి దొర్లవచ్చు అభ్యంతరం ఏమీలేదు—లేకపోగా అతిథి సత్కార సంభారాల్లో—అవసర నైవేద్యాల్లో అదొకటి—

అవన్నీ వట్టి గొడ్డురోజులంటావా?

ఆ మొగుళ్లందరూ పశువులంటావా?

అది, యిప్పటికి దామాయిషీ ప్రకారం నాగరికత అని అనడానికే వీలులేదంటావా?

అను—నాకేం తగాయిదాలేదు—

కాని—ఇది ఒక్కటిమాత్రం మరచిపోకు: ఆ ఆసాములందరూ చచ్చు పుచ్చు చవటలు కారు—బ్రహ్మవేత్తలు కారటయ్యా—అయె పో వాళ్లజోలి మనకెందుకు కాని—అసలు త్రోవకు వద్దాం—

---

* ఇదే వస్తువుతో రామకృష్ణశాస్త్రి గారు ఇంకో పెద్ద కథ కూడా రాశారు. ॥ప్రచురణ కర్తలు॥

మాటకు అడ్డంవచ్చి-ఆ రోజుల్లో ఆచారం అది: ఆ నాటికి అది పరుచుకుపోయింది అంటారా?-అయితే, సవాల్ చేస్తున్నాను-

ఉద్దాలకుడి తాతలనాటినుంచీ తరతరాలుగా వస్తూన్న, ఆచారమే అది అనుకుందాం అయితే, ఆ అనువాయితీ వాళ్ళ అబ్బాయికి ఎందుకు వంటపట్టిందికాదూ అంట! బొడ్డుఊడని వేలెడుకుంక ఉన్నాడో లేడో-నాడు, ఆ శ్వేతకేతువు- గడ్డాలూ మీసాలు మెరిసిన తండ్రిని పట్టుకుని 'నాన్నా, నీవు యిన్నాళ్ళ నుంచీ అనుకుంటూన్నది తప్పు అని గదమాయించి, యింటికి వేంచేసిన అతిథిని 'మా అమ్మ వంటిమీద చెయ్యివేశావా అంటే పళ్ళురాల్తాయి ఖబర్దార్!" అని నోరుచేసుకున్నాడా లేదా?

ఆశ్రమానికి వచ్చిన అతిధికి, తనకు కలిగినంతలో షడ్రసోపేతంగా భోజనం పెట్టాడు, మహర్షి ఉద్దాలకుడు,

తిన్నవాడు-తిన్న విశ్వాసాన, తనదోవను తాను, తపస్సులోకి చక్కాబోయాడా? ఊహు...

ఆశ్రమవాటిలో ఎప్పుడూ నిత్యవసంతమే కనుక-తిన్నతిండి, నిమిషంలో ఒంటపట్టింది - పండువెన్నెల్లో అన్నసారం కాస్తా ప్రజ్వలించింది...

మహర్షి యిల్లాలు, అంతవరదాకా అతిధి సత్కారానికని సతమతమై... అప్పుడే భోజనశాలలోంచి, మడి విడిచి యివతలకు వస్తూంది.

పసికందు, శ్వేతకేతుడు, తల్లిచంక నెక్కి ముద్దులు కుడుద్దామని, బారసాచుకుని గున గున వస్తున్నాడు... ఇంతలో నడమంతరంగా అమాంతం అతిథి తల్లికీ బిడ్డకూ అడ్డంవచ్చి ఒడిసి ఆ యిల్లాలుచేయి పట్టుకున్నాడు - ఒంటరితనం వైపుకు లాక్కుంటున్నాడు...

మహర్షి పత్ని, తలఎత్తి, అతిథివంక చూసి ఆ కళ్లల్లో నకనక కనిపెట్టింది-భర్తవైపు చూసింది. తనగార్హస్థ ధర్మానికి వన్నె తెస్తూందని, మెరమెచ్చుగా ఆయన తల పంకించాడు-విధేయురాలై, తల వంచుకుని, పశుకృత్యానికి, తరలిపోతూంది...

పసివాడికి... ఈ వైనం ఏమిటో అర్థం అయిందంటావా?

వాడు మహర్షి కొడుకాయెను-అలాటివాళ్ళు పుట్టీ పుట్టడంతోనే-వయసు గుంటపూవులు పూస్తుందన్నమాటే గాని- బుద్ధి అంతరిక్షానికి అందుకుంటుంది-

చూసీ చూడటంతోనే-ఏమీ నదురూ బెదురూ లేకుండా-అవతల మనిషిని అటకాయించాడు-

తల్లి కుర్రవాడి ఆర్భాటంచూసి బిత్తరపోయింది-

తండ్రి మాత్రం-

'అది అంతే!-'

ఆడదంటే-అడవిలో విరగ్గాసే పండూ ఫలం వంటిది-ఆకలేసినవాడు ఎవడైనా సరే ఆరగించవచ్చును-అంటూ, కుర్రవాణ్ణి దారికి అడ్డం తప్పించి, తన దగ్గిరకు తీసుకుపోయినాడు-

కాని,

శ్వేతకేతుడు తండ్రిని, విసిరికొట్టాడు-'నీ పెళ్ళాం సంగతికాదు. నేనంటూన్నది నా తల్లిమాట! నా తల్లిని, పరాయి మొగవాడు తాకకూడదు-'

నీ తల్లి లోకంతోపాటే-ఏం అందరు ఆడవాళ్ళూ అతిథిని కళ్ళనద్దుకోవడం లేదా? దీని మొగానే పొద్దు పొడిచిందా - అని మహర్షి కసురుకున్నాడు-

'అలాగే!- అయితే ఇకనుంచి లోకంలో తల్లులందరూ-ఇల్లాళ్ళందరూ, నా తల్లితో బాటే-ఇది నా అనుశాసనం ఈ క్షణంనుంచీ లోకంలో ప్రవర్తిల్లుతుంది-

మీ తరం యింతటితో అయిపోయింది... ఇక అంతా మా తరం!...'

ఇన్నిమాటలు అన్నాడోలేదో చెప్పలేం గాని ఇంత ఘాటుగా యింతకన్నా యింకా ఘాటుగా అని ఉంటాడు... తండ్రి అంతటితో కిక్కురు మనకుండా ఊరుకున్నాడు...

వాడి పుణ్యమా అంటూ, ఆనాడు ఒక పసిపాపడు-తండ్రికీ, అప్పట్లో చలామణీ అవుతూన్న, ధర్మానికీ ఎదురుతిరిగి నోరుచేసుకుని ఉండకపోతే... యివాళటివరకూ ఆడది చేట పెయ్యలాగా ఓ మూలను పడిఉండేదేకదా-

మధ్యకాలంలో, మనువు, ఆడదాన్ని ఎత్తిపడుతూ ఒకటి రెండు శ్లోకాలు గ్రంథంలో పట్టుబలవంతాన యిరికించినా - తతిమ్మా ధర్మవేత్తలందరూ స్త్రీ స్వాతంత్ర్యం విషయంలో కిచకిచలాడుతూనే ఉండిరిగా... అందాకా ఎందుకూ, సుమతీశతకంలో పద్యం వర్ణించారు కదా అని, లావు చేవఉన్న మగవాడెవడైనా పప్పులో ఉప్పు ఎక్కువైన ఏ సదవకాశమో లభించినప్పుడు యింటిదాని చెంపకాయ కొట్టకుండా ఊరుకుంటున్నాడంటావా-యీ సాటిలేని-

ఏమిటో, గ్రుడ్డిలో మెల్లగా, అవాళ వాడు తండ్రికి ఎదురు తిరగకపోయినట్లైతే-యీ మహిళోద్యమాలన్నీ అంకురించడానికి యింకా ఎన్ని యుగాలు పట్టేవి, బాబా!

ఇంకో మెట్టు క్రిందకు దిగుదాం-

ప్రహ్లాదుడు ఏం అఘోరించాడు?-తండ్రి, ఎన్నివిధాలుగా చిలకకు చెప్పినట్టు చెప్పినా-విన్నాడా?-అయన మాట వినకుండా మొరాయించి నందువల్ల-వాడికేం, తీపెళ్ళిందా-చెడిపోయినాడా?-

వీడూ-వాడు, యీ పుచ్చిపోయిన పుణ్యభూమిలో పుట్టకుండా-ఏరుషియాలో అవతరించి ఉంటే ఒకటోరకం విప్లవకారులుగా తయారై-లోకాన్ని ఊపేసి ఉండకపోయేవాళ్ళా?-అదిగో-మళ్ళీ, పితృవాక్య పరిపాలన అంటావ్- అదంతా, బాష్.

*[చుక్కాని, 15-4-1966]*

★ ★ ★